క్లుప్తంగా

బీరకుప్పంలో పింఛన్ల పంపిణీ



పింఛన్లు అందజేస్తున్న అపరంజిరాజు

నాగలాపురం: మండలంలోని బీరకుప్పంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ టి.అపరంజిరాజు శనివారం రూ.3వేలకు పెంచిన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పింఛన్‌ను రూ.3 వేలకు పెంచడంతో అవ్వా,తాతల్లో ఆనందం వెల్లివిరుస్తోందన్నారు. తామను పెద్దకొడుకులా ఆదుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని పింఛన్‌దారులు తెలిపారు. వైస్ ఎంపీపీ జాయిస్ ధానవేల్, సచివాలయ కన్వీనర్ జయంతి మధురాజు, కుప్పయ్య పాల్గొన్నారు.

క్యాన్సర్ వైద్య పరీక్షలు



పాపానాయుడుపేటలో కుట్టు మిషన్ల పంపిణీ

ఏర్పేడు: పద్మశ్రీ డాక్టర్ గుత్తా మునిరత్నం జయంతి సందర్భంగా మండలంలోని రావిళ్ల కండ్రిగ సచివాలయంలో రాస్ టాటా ట్రస్ట్ ఆధ్వర్యంలో పింక్ బస్సు ద్వారా ఉచిత క్యాన్సర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. రాస్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ రాజశేఖర్ నాయుడు, క్లస్టర్ లీడర్ పిరాణమ్మ, మహిళాభారతి ప్రాజెక్టు ఆఫీసర్ బాలాజీ రెడ్డి, హేమంత్ కుమార్, డాక్టర్ బార్గవి, రాజ్ పాల్గొన్నారు.

స్ప్రేయర్ల పంపిణీ

రేణిగుంట(శ్రీకాళహస్తి): రాస్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి పద్మశ్రీ డాక్టర్ గుత్తా మునిరత్నం జయంతి సందర్భంగా శనివారం పట్టణంలోని సంస్థ కార్యాలయంలో షెడ్యూల్ కులాల ఉప ప్రణాళికలో భాగంగా కేవీబీపురం మండలానికి చెందిన 20మంది ఎస్సీ రైతులకు బ్యాటరీ ఆపరేటర్ స్ప్రేయర్లను కేవీకే సీనియర్ శాస్త్రవేత్త ఎన్. శ్రీనివాసులు అందజేశారు. రాస్ మహిళా వాణి కుట్టుమిషన్లు, దుప్పట్లు, చేతికర్రలు, వినికిడి మిషన్లను అందజేశారు. అన్నదానం చేశారు.

కరకంబాడిలో కంటి వైద్య శిబిరం

రేణిగుంట: రాస్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి గుత్తా మునిరత్నం జయంతి సందర్భంగా శనివారం మండలంలోని కరకంబాడి ఇందిరానగర్‌లోని రాస్ మహిళాజ్యోతి మ్యూచువల్ బెనిఫిట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రాస్ సంయుక్త కార్యదర్శి మమత, పొదుపు సంఘాల ప్రాజెక్టు డైరెక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో మునిరత్నం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వైద్య పరీక్షలు నిర్వహించి, ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించారు. కుట్టు మిషన్లు, దుప్పట్లు, చేతి కర్రలను అందజేశారు. అరవింద కంటి ఆస్పత్రి వైద్య నిపుణులు డాక్టర్ భవ్య, డాక్టర్ మానస, డాక్టర్ వినోద్‌కుమార్, కరకంబాడి కెనరా బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణ తిరుచ్చిపై కల్యాణ వెంకన్న



చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై భక్తులకు సాక్షాత్కరించారు. వారపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలను నిర్వహించారు. అనంతరం స్వామివారికి అభిషేక సేవను నిర్వహించి, శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తదుపరి వైఖానస ఆగమోక్తంగా కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో ఊంజల్ సేవ చేపట్టారు. సర్వాలంకర శోభితుడైన శ్రీనివాసుడు, అమ్మవార్లతో కలసి బంగారు తిరుచ్చి వాహనంపై ఆశీనులై నాలుగు మాడ వీధులలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మీ, ఏఈఓ గోపీనాథ్, సూపరింటెండెంట్ చెంగల్రాయులు, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

చందన నృసింహుడు



గరుడ వాహనంపై స్వామివారు

రాపూరు: మండలంలోని పెంచలకోనలో ఉన్న పెనుశిల లక్ష్మీనరసింహస్వామి శనివారం చందనాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అభిషేకం, తిరుప్పావై, చందన అలంకరణ, శ్రీవారి నిత్యకల్యాణ మండపంలో శాంతి హోమం, కల్యాణం, మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం స్వామివారిని బంగారు గరుడ వాహనంపై కోన మాఢవీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు.

త్వరలో టౌన్ బ్యాంక్ ఏటీఎం సేవలు

- ఆదివారం బ్యాంకు పనిచేసేలా నిర్ణయం
- ప్రగతిపై ఆర్‌బీఐ సంతృప్తి
- చైర్మన్ శెట్టిపల్లె సురేష్



ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని సన్మానిస్తున్న టౌన్ బ్యాంక్ చైర్మన్ సురేష్, సభ్యులు

రేణిగుంట(శ్రీకాళహస్తి): శ్రీకాళహస్తి కోఆపరేటివ్ టౌన్ బ్యాంకు ఏటీఎం సేవలు అతి త్వరలో అందుబాటులోకి రానున్నట్లు చైర్మన్ శెట్టిపల్లి సురేష్ తెలిపారు. శనివారం టౌన్‌బ్యాంకు పాలకమండలి సభ్యులు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని కలిసి ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే సూచనల మేరకు ఖాతాదారుల సౌకర్యం కోసం తీసుకునే నిర్ణయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్యాంకు పనివేళలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మళ్లీ మధ్యాహ్నం 4 నుంచి రాత్రి 8గంటల వరకు, ఆదివారం బ్యాంకు పనిచేసే విధంగా చర్యలు తీసుకుంటున్నటు తెలిపారు. శుక్రవారం బ్యాంకు సెలవు ఇచ్చే విధంగా నిర్ణయం తీసుకున్నామన్నారు. ప్రస్తుతం అడుమాన అప్పులకు విధిస్తున్న వడ్డీని 15 శాతం నుంచి 12 శాతం వరకు తగ్గిస్తూ, అప్పుగా మంజూరు చేస్తున్న రూ.5లక్షల పరిమితిని రూ.10లక్షలకు పెంచుతున్నట్లు తెలిపారు. ఇంకా షేర్ హోల్డర్లకు 2000 సంవత్సరం నుంచి ఎలాంటి డివిడెండ్ పంపకం చేసేందుకు వీలులేకుండా ఆర్‌బీఐ నిబంధనలు విధించిన సంగతి విధితమేనన్నారు. ప్రస్తుతం బ్యాంకు ఖాతాదారులకు అందిస్తున్న సేవలు, ఆర్థిక పరిపుష్టిలో సాధించిన ప్రగతిని ఆర్‌బీఐ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసిందన్నారు. నిబంధనలు తొలగించి 2021–22 నుంచి షేర్ హోల్డర్లకు డివిడెండ్ 8శాతం వారి సేవింగ్స్ ఖాతాలో జమ చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. అలాగే గృహ నిర్మాణాలకు రుణం మంజూరు చేసేందుకు బైలా సవరణకు ఆదేశించినట్లు తెలిపారు. త్వరలో ఏటీఎం సేవలు ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు.

మంత్రి పెద్దిరెడ్డి దృష్టికి విద్యుత్ సమస్యలు



మంత్రి పెద్దిరెడ్డికి సమస్యలు విన్నవిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు: సత్యవేడు నియోజకవర్గ సమస్యలను రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తీసుకెళ్లారు. శనివారం ఉదయం తిరుపతిలోని క్యాంప్ కార్యాలయంలో మంత్రిని ఎమ్మెల్యే కలిశారు. నియోజకవర్గంలోని విద్యుత్ సమస్యలతో పాటు రాజకీయ పరిస్థితులను మంత్రికి వివరించారు. తన వినతులకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు సుమన్‌కుమార్ పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతల పంపిణీ



శ్రీకాళహస్తి: అయోధ్య శ్రీరాముడి అక్షింతలు శనివారం శ్రీకాళహస్తికి చేరాయి. ఈ సందర్భంగా పట్టణంలోని కొత్తపేట శ్రీరామమందిరంలో అక్షింతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ఆయోధ్య రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో ప్రజలకు పంపిణీ చేశారు. మూర్తిగారి రమేష్‌బాబు, కరణం రమేష్‌బాబు, పుష్పాల నవనీతం, గరికపాటి రమేష్‌బాబు, డాక్టర్ రమణారెడ్డి, కొటిట్లడి ప్రసాద్, పగడాల భగవాన్, రాజా తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ల పంపిణీ

ఏర్పేడు: రాష్ట్రీయ సేవా సమితి వ్యవస్థాపకుడు పద్మశ్రీ డాక్టర్ గుత్తా మునిరత్నం జయంతి సందర్భంగా రాస్ మహిళా భారతి, జన శిక్షణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో పాపానాయుడుపేట కార్యాలయంలో శనివారం కుట్టు మిషన్ల పంపిణీ, బ్యూటీషన్ శిక్షణ, కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మహిళలకు రాస్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ రాజశేఖర్ నాయుడు కుట్టు మిషన్లను అందించారు. ఆయన మాట్లాడుతూ మునిరత్నం పేదల పక్షపాతిగా నిలిచారని కొనియడారు. జనరల్ బాడీ మెంబర్ వేణుగోపాల్ చౌదరి, సర్పంచ్ లలితా కరుణాకర్, కమిటీ చైర్మన్ తంబా సుబ్రహ్మణ్యం, జన శిక్షణ సంస్థ బాలాజీ రెడ్డి, ప్రాజెక్టు అధికారి రాస్ మహిళా భారతి, డ్రగ్ డిఅడిక్షన్ ప్రాజెక్ట్ అధికారి అన్నాదొరై పాల్గొన్నారు.

పోషణ కిట్లు సక్రమంగా అందజేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

సత్యవేడు: అంగన్ వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ పోషణ కిట్లు సక్రమంగా పంపిణీ చేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో వెల్ఫేర్ అసిసెంట్లు, మహిళా పోలీసులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషక పదార్థాలను (పాలు, బాలామృతం), వైఎస్సార్ కిట్(అటుకులు, రాగి పిండి, బెల్లం, చిక్కీ, కర్జూరం) లబ్ధిదారులకు అందించే విధానాలపై సమావేశం జరిగింది. సూపర్‌వైజర్ ఏ. చెంచులక్ష్మి మాట్లాడుతూ 55 సెంటర్ల పరిధిలో గర్భిణులు 337 మంది, బాలింతలు 397 మందికి పోషక పదార్థాలు సక్రమంగా అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 17 సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి సాయం



నగదు అందజేస్తున్న బియ్యపు ఆకర్ష్ రెడ్డి

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురంలో దాము కుటుంబానికి శనివారం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కుమారుడు ఆకర్ష్‌రెడ్డి ఆర్థిక సాయం అందించి చేయూతనిచ్చారు. గ్రామానికి చెందిన దాము (54) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు ఆకర్ష్‌రెడ్డి గ్రామానికి వెళ్లి మృతుని కుటుంబాన్ని పరామర్శించి, రూ.10 వేలు నగదును అందించారు. సర్పంచ్ మంజుల, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు మునిరత్నం రెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు గురవారెడ్డి, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలన సమష్టి బాధ్యత



మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాసులునాయక్

రేణిగుంట(శ్రీకాళహస్తి): బాల్య వివాహాల నిర్మూలన సమష్టి బాధ్యతని శ్రీకాళహస్తి 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. శుక్రవారం హైకోర్టు ఆదేశాల మేరకు శ్రీకాళహస్తి కాసాగార్డెన్‌లోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో బాలికల చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీనివాస్‌నాయక్ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా, బాలికల రక్షణ చట్టాలు, బాల్య వివాహాల నిర్మూలన చట్టం, సమాచార హక్కు చట్టం, లీగల్ సర్వీస్ చట్టాలు, లైంగిక వేధింపుల నిర్మూలనలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలతో అనేక అనర్థాలు చోటు చేసుకుంటాయని తెలిపారు. ఉచిత న్యాయ సలహాల కోసం 15100 నంబర్‌ను సంప్రదించాలన్నారు. సీనియర్ న్యాయవాదులు మల్లికార్జునయ్య, శ్రీరామ్, రాజేశ్వరరావు, ప్రిన్సిపల్ ప్రభావతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీఐగా భాస్కర్‌నాయక్



భాస్కర్‌నాయక్

నారాయణవనం: పుత్తూరు రూరల్(నారాయణవనం) సీఐగా శనివారం సాయంత్రం భాస్కర్‌నాయక్ బాధ్యతలు తీసుకున్నారు. ఇదివరకు సీఐగా పనిచేసిన సురేష్‌బాబు ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్‌కు బదిలీపై వెళ్లారు. తిరుపతి వీఆర్ నుంచి భాస్కర్‌నాయక్ ఇక్కడికి వచ్చారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో శాంతిభద్రతలకు ప్రాధాన్యం ఇస్తామన్నారు.

నిత్య భజనలకు అవకాశం ఇవ్వండి



చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న కళాక్షేత్రం సభ్యులు

రేణిగుంట(శ్రీకాళహస్తి): శ్రీకాళహస్తీశ్వరాలయ ప్రాంగణంలో శివనామ సంకీర్తనలు, నిత్య భజనలకు అవకాశం కల్పించాలని అన్నమయ్య జానపద కళాక్షేత్రం సభ్యులు శనివారం పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ అన్నమయ్య జానపద కళాక్షేత్రం ఆధ్వర్యంలో 24గంటలు శివనామ సంకీర్తన, నిత్య భజనలు, కోలాటం బృంద ప్రదర్శనలు, పండరీ భజన ఇలా అన్ని రకాల భజన బృందాలు శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రతిరోజూ భజన చేసుకునే విధంగా పాలకమండలి సమావేశంలో తీర్మానం చేసే విధంగా కృషి చేస్తామన్నారు. మహాశివరాత్రి వేడుకల్లో కూడా ప్రాధాన్యం ఇస్తామన్నారు. కళాక్షేత్రం జిల్లా కన్వీనర్ సంక్రాంతి వెంకటయ్య, రాష్ట్ర కార్యదర్శి బంగారు మురళి, పులయ్య, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీ నరసింహస్వామికి ప్రత్యేక పూజలు



రేణిగుంట(శ్రీకాళహస్తి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధ భరద్వాజతీర్థంలో వెలసి ఉన్న శ్రీచెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామికి పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా కలశస్థాపన పూజలు నిర్వహించారు. అనంతరం పలు రకాల అభిషేకలను నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

ఎమ్మెల్యేను విమర్శిస్తే ఖబడ్దార్

- జనసేన నేతలు వాస్తవాలు మాట్లాడాలి
- కాపు భవనం కేటాయించింది ఎవరు?
- బలిజలను పట్టించుకోని బొజ్జల కుటుంబం
- వైఎస్సార్ సీపీ నేత శరవణకుమార్



రేణిగుంట(శ్రీకాళహస్తి): బలిజ కులస్తుల అభ్యున్నతికి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారని, ఎన్నికలు సమీపిస్తున్నాయని ఎమ్మెల్యేపై అవాస్తవ ఆరోపణలు చేస్తే ఖబడ్దార్ అని వైఎస్సార్ సీపీ నేత, మాజీ కౌన్సిలర్ ఉత్తరాజి శరవణకుమార్ హెచ్చరించారు. శనివారం బలిజల భవన నిర్మాణానికి కేటాయించిన స్థలం వద్దకు ఓట్లు లేనివారిని వెనకేసుకుని వచ్చి జనసేన నాయకులు కోట వినుత, చంద్రబాబు కాపులపై కపట ప్రేమ చూపించడాన్ని చూసి జనం నవ్వుకుంటున్నారని పేర్కొన్నారు. శరవణకుమార్ మాట్లాడుతూ ఇక్కడ భవనం ఎప్పుడు నిర్మిస్తారని, ఎమ్మెల్యే కాపులకు ఏం చేశారంటూ మాట్లాడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. గత ఎన్నికల్లో నిలబడి ఘోరంగా ఓడిపోయిన తర్వాత ఇప్పటి వరకు జనం గుర్తుకు రాలేదని, వినుత కాపు ఆడపడుచు కాబట్టి మర్యాదగా మాట్లాడుతున్నామని, ఈసారి విమర్శలు చేస్తే పరిస్థితి తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. శ్రీకాళహస్తిలో 30 సంవత్సరాలు బొజ్జల కుటుంబం పరిపాలించిందని, కాపులను నామరూపాలు లేకుండా చేసిందని తెలిపారు. కాపు భవనం కోసం స్థలం కేటాయించాలని కాపులు వారి చుట్టూ తిరిగినా ఫలితంలేక పోయిందన్నారు. నేడు వారి పక్కన కూర్చుని కాపులకు ఎమ్మెల్యే ఏం చేశారంటూ మాట్లాడడం సరికాదన్నారు. బొజ్జల కుటుంబాన్ని ప్రశించిన తరువాత మధుసూదన్‌రెడ్డిపై విమర్శలు చేయాలని హితవు పలికారు. ఎమ్మెల్యే చొరవతో నేడు ఆ స్థలం చుట్టు ప్రహరీ నిర్మించామన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయ ట్రస్టుబోర్డు చైర్మన్ పదవి, టౌన్‌బ్యాంకు చైర్మన్ పదవి, ఆలయంలో నలుగురు, టౌన్‌బ్యాంకులో ముగ్గురికి కాపులకు ఎమ్మెల్యే అవకాశం ఇచ్చారన్నారు. వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడుగా కాపు నేతకు అవకాశం ఇచ్చారని, అలాంటి ఎమ్మెల్యేపై అవాకులు పేలితే సహించమన్నారు.

ఖాదర్‌బాషాకు స్వాగతం



రేణిగుంట: వైఎస్సార్ సీపీ ముస్లిం మైనారిటీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఖాదర్‌బాషకు శనివారం రేణిగుంట విమానాశ్రయంలో స్థానిక ముస్లిం నాయకులు సాదర స్వాగతం పలికారు. ఆయనను శాలువాతో సత్కరించారు. మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటామని స్పష్టం చేశారు. ఆయన్ను కలసిన వారిలో షేక్ షాజహాన్, బావాజి, సాదిక్‌బాష, ఇలియాస్, వలిసాహెబ్, అబ్దుల్లా, అబ్దుల్ గని, ఖాదర్ షరీఫ్ తదితరులు ఉన్నారు.

జాతీయ భావాన్ని పెంపొందించేలా డైరీలు

తిరుపతి అర్బన్: జాతీయ భావాన్ని పెంపొందించేలా అపస్ డైరీలు, క్యాలెండర్లు ఉన్నా యని డీఈవో వి.శేఖర్ తెలిపారు. తిరుపతి డీఈవో కార్యాలయంలో శనివారం అపస్(ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం) ఆధ్వర్యంలో డీఈవో శేఖర్ చేతుల మీదుగా క్యాలెండ్‌ను ఆవిష్కరించారు. ముందుగా డీఈవోను దుశ్శాలువాతో సత్కరించారు.

రసవత్తరంగా ఆడుదాం-ఆంధ్రా



సత్యవేడు: క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు



నారాయణవనం: కిట్లను అందజేస్తున్న ఎంపీపీ



వరదయ్యపాళెం : టెన్నిస్ విజేత జట్టు

సత్యవేడు: ఆడుదాం.. ఆంధ్రా పోటీలు రసవత్తరంగా సాగుతున్నట్లు ఎంఈడీఓ చంద్రశేఖర్ తెలిపారు. శనివారం బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో క్రికెట్ పోటీలు ముగింపు దశకు చేరుకున్నాయన్నారు. రెండో దశకు ఎంపికైన 170 టీములు, 1938 మంది క్రీడాకారులను ఆయన అభినందించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల వల్ల ఎంతో మంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా రాణించే అవకాశం ఉందన్నారు. ఈనెల 10వ తేదీ నుంచి మండల స్థాయి రెండవ దశ ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు ప్రారంభమవుతాయన్నారు.ఎంఈఓ కె.రవి, పీడీలు మురళి, అపర్ణ, గ్రేస్‌ప్రతిమ, ఢిల్లీ రాణి, స్వర్ణ పాల్గొన్నారు.

క్రీడాకారులకు టీషర్ట్‌లు పంపిణీ

నాగలాపురం: మండలంలోని ఎస్ఎస్‌పురం గ్రామ సచివాలయంలో శనివారం ఆడుదాం–ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా క్రీడాకారులకు సర్పంచ్ కె.కృష్ణమ శెట్టి చేతుల మీదుగా టీషర్ట్‌లు అందజేశారు. సర్పంచ్ మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే ఆడుదాం ఆంధ్రా పోటీలను నిర్వహిస్తున్నారని తెలిపారు.

నైపుణ్యాలను వెలికితీసేందుకే..

నారాయణవనం: గ్రామీణ క్రీడాకారుల్లోని నైపుణ్యాలను వెలికి తెచ్చేందుకే ఆడుదాం–ఆంధ్రను ప్రభుత్వం నిర్వహిస్తోందని ఎంపీపీ దివాకర్‌రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో నారాయణవనంలోని మూడు సచివాలయాల పరిధిలోని యువకులకు ఆడుదాం–ఆంధ్ర క్రీడలకు సంబంధించి దుస్తులు, ఆట వస్తువులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆటలతో ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం పొందే అవకాశం ఉంటుందని అన్నారు. ఎంపీడీవో కృష్ణమూర్తి, ఏవో గుణశేఖర్, ఎంఈవో ప్రభాకర్‌రాజు, పంచాయతీ కార్యదర్శి షణ్ముగం, ప్రజాప్రతినిధులు చిన్నదొరై, గురుస్వామి, మనోహర్, సారకాయలు, మోహన్, దొరైరాజ్, ఢిల్లీబాబు, హెచ్‌ఎం శశికల, పీడీలు జయప్రకాష్, జయప్రద, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు వరం ఆడుదాం ఆంధ్ర

వరదయ్యపాళెం: ఆడుదాం–ఆంధ్ర క్రీడా పోటీలు గ్రామీణ క్రీడాకారులకు వరం లాంటిదని జెడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం కదూరు సచివాలయానికి సంబంధించి గోవర్ధనపురం హైస్కూల్ క్రీడా మైదానంలో ఆడుదాం ఆంధ్ర పోటీలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా జెడ్పీటీసీ సభ్యుడు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరై పోటీలను ప్రారంభించారు. ఖోఖో, కబడ్డీ, క్రికెట్, టెన్నిస్ క్రీడా పోటీల్లో యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు పాల సుబ్రమణ్యం రెడ్డి, సురుటుపల్లి పాలక మండలి సభ్యుడు నాని రెడ్డి, మండల యూత్ కన్వీనర్ వినోద్ యాదవ్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి, పీఈటీలు బందిల కుమార్, ముద్దుకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కళత్తూరులో గ్రంథాలయం ప్రారంభం



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న మధుబాల

కేవీబీపురం: మండలంలోని కళత్తూరులో జిల్లా గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో శనివారం మినీ గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్‌పర్సన్ మధుబాల దీన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామస్తుల విజ్ఞప్తితో మినీ గ్రంథాలయం ప్రారంభించినట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ నేతలు నంద కుమార్, లోకనాథరెడ్డి, దశరథరామిరెడ్డి, శ్రీనివాసులు, భాస్కర్, ఢిల్లీ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



డాక్టర్ చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: క్రీడలు మానసిక, శారీరక ఉత్తేజాన్ని కలిగిస్తాయని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. పట్టణంలో విక్రమ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్‌చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఐస్టా సీనియర్ నేషన్ టెన్నిస్ టోర్నమెంటుకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గతంలో సిద్దులు చలమయ్య ఆధ్వర్యంలో టెన్నిస్ పోటీలకు శ్రీకారంచుట్టారన్నారు. వాటిని డాక్టర్ చంద్రశేఖర్ కొనసాగించడం సంతోషకరమని తెలిపారు. జాతీయస్థాయి టెన్నిస్ టోర్నమెంటును నిర్వహించి, క్రీడాకారులకు సదుపాయాలను కల్పించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో విక్రమ్ కళాశాల సిబ్బంది, క్రీడాకారులు, వైఎస్సార్ సీపీ నాయకులు బాలగౌడ్ తదితరులు పాల్గొన్నారు.